# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 18 సంచిక: 58 | గురువారం, 14 నవంబర్ 2024 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



MHR TV
www.MHRtv.com


## బతుకమ్మ కుంటలో కూల్చివేతలు ఉండవు



2

- స్థానికుల విజ్ఞప్తితో చెరువు పునరుద్ధరణ పనులు చేపడతాం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట పరిశీలన



## కలెక్టర్‌పై దాడి చేయిస్తే వెనక్కి తగ్గుతామా?

- పరిశ్రమలు రావాలంటే భూ సేకరణ జరగాల్సిందే..
- యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తే తప్ప ప్రపంచంతో పోటీ పడలేం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



2

## ప్రియురాలిని హతమార్చి.. పత్తి చేలో పాతిపెట్టి

- మూడు రోజుల తర్వాత విషయం బయటకి...
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘటన



2

## భావి భారత పౌరుల భవిష్యత్తు కోసమే..

- విద్యా రంగంలో మార్పులకు కాంగ్రెస్ సర్కార్ శ్రీకారం
- బాలల దినోత్సవం సందర్భంగా సీఎం శుభాకాంక్షలు
- అన్ని వర్గాలకు విద్యను అందిచేందుకు చిత్తశుద్ధితోనే పనిచేస్తున్నాం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




## కిడ్నాపర్లలా వచ్చి తీసుకెళ్తే..
# అరెస్టు అంటారా..?

- నోటీసులు, కుటుంబానికి సమాచారం ఇవ్వకుండా తీసుకెళ్లారు
- ఉద్దేశపూర్వకంగా అశాంతి రగిల్చి భూములు లాక్కునే యత్నిస్తున్నరు
- రైతులు జైల్లో ఉంటే.. మంత్రులు లండన్‌లో ఎంజాయ్ చేస్తున్నరు
- సీఎం రేవంత్ మహారాష్ట్ర ఎన్నికల్లో బిజీగా ఉన్నారు
- ఫార్మా విలేజ్‌ను నిరసిస్తూ ఆరు నెలలుగా కొడంగల్ రైతులు ఉద్యమిస్తున్నారు
- ముచ్చర్లలో ఫార్మా సిటీ రద్దు అని సీఎం చెబితే భూములిచ్చిన రైతులు సంతోషపడ్డారు
- కేసీఆర్ ఆనవాళ్లు ఉండొద్దని ఫార్మా సిటీ పేరును ఫార్మా విలేజ్‌గా మార్చారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**
వికారాబాద్ దాడి ఘటనలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు మఫ్టీలో వచ్చి తీసుకెళ్లారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కిడ్నాపర్లలా వచ్చి తీసుకెళ్తే దాన్ని అరెస్టు అంటారా..? అని ప్రశ్నించారు. నోటీసులు, కుటుంబానికి సమాచారం ఇవ్వకుండా తీసుకెళ్లారని విమర్శించారు. "నరేందర్‌రెడ్డికి ప్రైవేటు సిబ్బందితో వైద్య పరీక్షలు చేయించాలి. ప్రభుత్వ వైద్యులు, ప్రభుత్వ వ్యవస్థపై మాకు నమ్మకం లేదు. అరెస్టు చేసిన వారిని చిత్రహింసలు పెట్టారని సమాచారం. కలెక్టర్ దాడి జరగలేదన్నారు.. దాడి జరిగిందని ఐజీ చెబుతున్నారు. వికారాబాద్ లగచర్ల ఘటన నిఘా వ్యవస్థ వైఫల్యమే. ఉద్దేశపూర్వకంగా అశాంతి రగిల్చి భూములు లాక్కునే యత్నమిది" అని కేటీఆర్ ఆరోపించారు.

**ప్రజల తిరుగుబాటులో ఎవరి కుట్రా లేదు...**

కొడంగల్ రైతులు జైల్లో ఉన్న ఈ సమయంలో మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లండన్‌లో ఏం చేస్తున్నారో చూడండంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఫార్మా సిటీ విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యపు భూ సేకరణను నిరసిస్తూ 16 మంది రైతులు జైల్లో ఉన్నారని, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్ అయ్యారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న పని చూడండంటూ ఎక్స్ వేదికగా ఓ వీడియోను పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఓ బస్సులో పౌరాణిక పాత్రలను మిగతా 2లో..

## పట్నం నరేందర్‌రెడ్డికి
# 14 రోజుల రిమాండ్

- నరేందర్‌రెడ్డిని కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు
- ఈ నెల 27 వరకు రిమాండ్ విధించిన కొడంగల్ కోర్టు
- లగచర్ల ఘటనలో నరేందర్‌రెడ్డి ప్రమేయం ఉందనే ఆరోపణలతో అరెస్ట్
- రేవంత్ అప్రజాస్వామిక పాలనపై తమ పోరాటం కొనసాగుతుంది
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**
వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి చేసిన ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. లగచర్ల ఘటనలో నరేందర్ రెడ్డి ప్రమేయం ఉందనే ఆరోపణలతో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన పోలీసులు... కొడంగల్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆయనకు ఈ నెల 27వ తేదీ వరకు రిమాండ్ విధించింది. పట్నం నరేందర్ రెడ్డిని చర్లపల్లి జైలుకు తరలించనున్నారు. లగచర్ల ఘటనలో పోలీసులు 16 మిగతా 2లో..

## నేను ఎంపీని.. నా నియోజకవర్గంలో
# పర్యటించొద్దా..?

- లగచర్లకు వెళ్తున్న డీకే అరుణను అడ్డుకున్న పోలీసులు
- పోలీసుల తీరుపై డీకే అరుణ ఫైర్
- జిల్లా కలెక్టర్‌ను కూడా కలవనివ్వరా?
- లా అండ్ ఆర్డర్ బ్రేక్ చేసే పని నేనెం చేయలే..



2

## ఫార్మా విలేజ్ ప్రాజెక్టుపై వెనక్కి తగ్గేది లేదు

- ఫార్మాతో పాటు మరిన్ని పరిశ్రమలు వస్తాయి
- ఫార్మా మాత్రమే కాకుండా ఇతర కంపెనీలు కూడా వస్తాయి
- కలెక్టర్, ఇతర అధికారులపై దాడి సరికాదు
- దాడి ఘటనలో అందరూ అరెస్ట్ అవుతారు
- సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి



2

## హరీశ్.. తెలుసుకొని మాట్లాడు

- కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం కట్టుబడి ఉంది
- మా హయాంలో జరిగిన జగిత్యాల అభివృద్ధి ఉమ్మడి రాష్ట్రానికి రోల్ మోడల్
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫైర్..



2

## ప్రశ్నించే గొంతును నిర్బంధాలతో అణిచివేయలేరు

- పట్నం నరేందర్ రెడ్డిని అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గం..
- పాలన గాలికి వదిలి అరెస్టులు, అక్రమ కేసులు, ముందస్తు నిర్బంధాలా?
- రైతులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో పెట్టడమే మీ ఇంది రమ్మ రాజ్యమా?
- సీఎం మీద ఈ ప్రభుత్వం మీద కోపంతో దాడి జరిగింది
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు





## మా కుటుంబంలో
# ఒకరికి మంత్రి పదవి..

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు
- పెద్దపల్లి ఎమ్మెల్యే వివేక్ ఆసక్తికర వ్యాఖ్యలు

2

## ప్రియురాలిని హతమార్చి.. పత్తి చేలో పాతిపెట్టి

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేనిపేట తండాలో దారుణం జరిగింది. స్వాతి అనే యువతి దారుణ హత్యకు గురైంది. ఆమె ప్రియుడు వీరభద్రం.. యువతిని అతి కిరాతకంగా చంపి గ్రామ సమీపంలోని పత్తి పొలంలో పాతిపెట్టాడు. మూడు రోజుల తర్వాత హత్య ఘటన వెలుగులోకి రావడంతో పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. మణుగూరు మండలం తోగ్గుడేనికి చెందిన స్వాతి(32) ఆరేళ్లుగా వీరభద్రంతో సహజీవనం చేస్తూ మాచినేనిపేట తండాలోనే ఉంటోంది. భద్రం భార్యతో పాటు స్వాతి కూడా ఒకే ఇంట్లో ఉంటున్నారు. కుటుంబ తగాదాలు, ఆర్థిక లావాదేవీలతోపాటు పలు కేసుల్లో భద్రం నిందితుడిగా ఉన్నాడు. కొంతకాలంగా భద్రం, స్వాతిల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రియురాలి అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న భద్రం.. ఈనెల 9న తన ఇంట్లోనే స్వాతిని దారుణంగా హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని సమీపంలోని తన పత్తి పొలంలో పాతిపెట్టాడు. కొత్తగూడెం డీఎస్పీ, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణా ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు.. మృతదేహాన్ని వెలికి తీసే చర్యలు చేపట్టారు.

## మా కుటుంబంలో ఒకరికి మంత్రి పదవి..

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

తమ కుటుంబంలో ఒకరికి మంత్రి పదవి ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని పెద్దపల్లి ఎమ్మెల్యే వివేక్ అన్నారు. తెలంగాణలో కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతున్న సమయంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాకా కుటుంబంలో ఒకరికి మంత్రి పదవిపై హామీ లభించింది, కానీ నాకు మాలల అభివృద్ధి, హక్కులు ముఖ్యం... మంత్రి పదవి కాదని వివేక్ అన్నారు. త్వరలో హైదరాబాద్‌లోని పరేడ్ మైదానంలో మాలల భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు అందరూ రావాలని పిలుపునిచ్చారు. మాలల ఐక్యతను చాటుదామన్నారు. దళితుల్లో ఉపకులాలు ఎక్కువగా ఉన్నాయని, వారందరికీ న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా, ఎస్సీల ఐక్యత కోసం మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్ర బుధవారం మానకొండూర్ చేరుకుంది. ఆయన పాదయాత్రకు వివేక్ సంఘీభావం తెలిపారు.



## పట్నం నరేందర్‌రెడ్డికి 14 రోజుల రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ కేసులో ఈ రోజు మరో నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ రోజు అరెస్టైన వారిలో ప్రధాన నిందితుడు సురేశ్ సోదరుడితో పాటు మరో ముగ్గురు ఉన్నారు.

**నా అరెస్ట్ అక్రమం : పట్నం నరేందర్ రెడ్డి**

కోర్టుకు తరలించే క్రమంలో పట్నం నరేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తన అరెస్ట్ అక్రమమన్నారు. రేవంత్ రెడ్డి అప్రజాస్వామిక పాలనపై తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కొడంగల్‌లో రైతుల తిరుగుబాటుతో రేవంత్ రెడ్డి పరువు పోయిందని మండిపడ్డారు. లగచర్ల ఘటనను బీఆర్ఎస్ పార్టీకి ఆపాదించి కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు.

## కిడ్నాపర్లలా వచ్చి తీసుకెళ్తే.. అరెస్టు అంటారా..?

(మొదటి పేజీ తరువాయి)



ఇమిటేట్ చేస్తూ ఎంజాయ్ చేస్తున్నట్లుగా ఆ వీడియోలో ఉంది. మరోవైపు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు లండన్‌లో ఉన్నారని, కానీ రైతులు మాత్రం జైల్లో ఉన్నారని ఎక్స్ వేదికగా కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆరు నెలలుగా పోరాటం...**

ఫార్మా విలేజ్‌ను నిరసిస్తూ ఆరు నెలలుగా కొడంగల్ నియోజకవర్గంలో రైతులు ఉద్యమిస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల తిరుగుబాటులో ఎవరి కుట్రా లేదన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ముచ్చర్లలో ఫార్మా సిటీ రద్దు అని సీఎం చెప్పగానే భూములు ఇచ్చిన రైతులు సంతోషపడ్డారన్నారు. తమ భూములు తమకు ఇస్తారని రైతులు సంతోషపడ్డారన్నారు. కానీ నెల రోజుల్లోనే ఫార్మా సిటీ రద్దు అటుంచి... ఫార్మా విలేజ్ పెడతామని చెప్పడంతో వారు ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ ఆనవాళ్లు ఉండకూడదన్న ఉద్దేశంతో ఫార్మా సిటీ పేరును ఫార్మా విలేజ్‌గా మార్చారని ఆరోపించారు. ఫార్మా రంగాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో అంతర్జాతీయ ఫార్మా యూనివర్సిటీ తేవాలని తాము 14 వేల ఎకరాలు సేకరించామని తెలిపారు. ఏమీ తెలియకుండానే తాము ఇదంతా చేయలేదన్నారు. తెలంగాణను ఫార్మా రంగంలో లీడర్ చేయాలని భావించామని... ఫార్మా సిటీని అత్యున్నతంగా తీర్చిదిద్దేందుకు అధికారులు విదేశాల్లో కూడా పర్యటించినట్లు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఫార్మా సిటీ పూర్తి చేద్దామని తాము భావించామని, అలాగే భూములిచ్చిన రైతులకు ప్లాట్లు కూడా ఇచ్చే విధంగా ఏర్పాటు చేశామన్నారు. అలాంటి ఫార్మా సిటీని వదిలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన తుగ్లక్, మూర్ఖ నిర్ణయాలతో అందరినీ ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. అందుకే ప్రజలు తిరగబడుతున్నారని తెలిపారు.

## భావి భారత పౌరుల భవిష్యత్తు కోసమే..

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**



స్వాంతత్ర్య సమరయోధులు, భారతదేశ ప్రథమ ప్రధానమంత్రి స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ జయంతి (నవంబర్ 14) సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆ మహనీయుడికి నివాళులు అర్పించారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి బాలబాలికలు అందరికీ హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. నేటి బాలబాలికలే భావి భారత పౌరులని విశ్వసించి ప్రజా ప్రభుత్వం పాఠశాల విద్యా రంగంలో వినూత్నమైన మార్పులకు శ్రీకారం చుట్టిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు విద్యను దూరం చేయరాదన్న చిత్తశుద్ధితోనే ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ప్రతి ఏటా రెండు యూనిఫామ్స్ అందించాలని, ఆ బాధ్యతను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించడం జరిగింది. అలాగే పాఠశాలలకు ఉచిత విద్యుత్తు అందించే నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. భావి భారత పౌరులను తయారు చేయడంలో భాగంగానే విద్యా రంగంలో సమూల మార్పులు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యా సంస్కరణల్లో భాగంగా నిపుణులతో కూడిన విద్యా కమిషన్ ఏర్పాటు, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు, కొత్త నియామకాలు అన్నీ నేటి పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించాలన్న సంకల్పంలో భాగంగా చేపట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఏకీకృత గురుకుల పాఠశాలలకు శ్రీకారం చుట్టినట్టు పేర్కొన్నారు. పిల్లలు జాతి సంపదగా భావించి అందరూ వారి భవితవ్యానికి కృషి చేయాలని చెప్పిన నెహ్రూ ఆకాంక్షల మేరకు వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి కోరారు.

## కలెక్టర్‌పై దాడి చేయిస్తే వెనక్కి తగ్గుతామా?

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**




వెనుకబడిన కొడంగల్‌ను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తే తప్ప ప్రపంచంతో పోటీ పడలేమన్నారు. పరిశ్రమలు రావాలంటే భూ సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. పరిశ్రమలు పెద్ద ఎత్తున తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ''భూమి కోల్పోతున్న రైతుల బాధ మాకు తెలుసు. రైతుల బాధను ఇందిరమ్మ ప్రభుత్వం అర్థం చేసుకుంది. భూమి కోల్పోతున్న వారికి మెరుగైన ప్యాకేజీతో పాటు పరిశ్రమలో ఉద్యోగాలు కల్పిస్తాం. ఇళ్లు కోల్పోతున్న వారికి మంచి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇస్తున్నాం. కావాలనే కుట్రపూరితంగా కలెక్టర్‌పై భారాస శ్రేణులు దాడి చేశాయి. అమాయక గిరిజనులను రెచ్చగొట్టి దాడికి ఉసిగొల్పారు. కలెక్టర్, అధికారులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడి సమస్యకు పరిష్కారం కాదు.. కలెక్టర్‌తో చర్చించి పరిష్కరించుకోవాలి. ఇందిరమ్మ రాజ్యంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంది. రాష్ట్రంలో పరిశ్రమలు రావడం భారాసకు ఇష్టం లేదా? ఇది బాధ్యత కలిగిన ప్రతిపక్షం చేయాల్సిన పని కాదు. ప్రాజెక్టుల కోసం మీరు చాలా భూసేకరణ చేశారు.. ఏనాడూ మేం కాదనలేదు. కలెక్టర్‌పై దాడి చేయిస్తే వెనక్కి తగ్గుతాం అనుకుంటున్నారా? అభివృద్ధే మా లక్ష్యం. అధికారులపై దాడి చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయి. మీ కోసం అమాయక ప్రజలు నష్టపోవాలా? ఉద్యమ సమయంలో కూడా ప్రజలను రెచ్చగొట్టి ప్రాణాలు కోల్పోయేలా చేశారు'' అని భట్టి విక్రమార్క విమర్శించారు.

## నేను ఎంపీని.. నా నియోజకవర్గంలో పర్యటించొద్దా..?

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

నేను ఎంపీగా నా నియోజకవర్గంలో పరామర్శించొద్దా..? అని బీజేపీ ఎంపీ డీకె అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్ లగచర్ల పర్యటనలో ఉద్రిక్రత వాతావరణం నెలకొంది. లగచర్ల కు వెళుతున్న డీకే అరుణను మన్నెగూడ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరుపై డీకే అరుణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నేను ఎంపీగా నా నియోజకవర్గంలో పరామర్శించొద్దా..? అని మండిపడ్డారు. నేను ఎంపీని.. నేను ఏ తప్పు చేశానని అడ్డుకుంటున్నారో చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి వల్లే జిల్లాలో లా అండ్ ఆర్డర్ సమస్య వచ్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను జిల్లా కలెక్టర్ ను కలిసేందుకు వెళ్తున్నామని అన్నారు. తాను నా నియోజకవర్గంలో ఎక్కడికైనా వెళ్లే హక్కు ఉందన్నారు. తన సొంత నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేసుకోలేక పోయారన్నారు. మేము ఏమైనా లా అండ్ ఆర్డర్ బ్రేక్ చేసే పని ఏమీ చేయడం లేదని క్లారిటీ ఇచ్చారు. కలెక్టర్ ను కలుస్తామని అపాయింట్మెంట్ ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వల్ల లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం వచ్చిందని సంచలన ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేయండి అని కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి వెళ్తే లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ రాదా..? అని పోలీసులకు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అన్నను పంపిస్తారు.. ఎంపీగా నేను వెళ్లకూడదా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేక్కడి దౌర్జన్యం.. రాష్ట్రంలో ఎంపీగా నా నియోజకవర్గంలో నేను పర్యటించొద్దా..? అన్నారు. తాను స్టేషన్ లోకి ఎందుకు వస్తాను, నేనేం తప్పు చేశానని భీష్మించుకుని రోడ్డుపై బైఠాయించారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు సముదాయించిన అనంతరం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో ఎంపీ డీకే అరుణ మాట్లాడారు. ఘటన జరిగిన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



## ఫార్మా విలేజ్ ప్రాజెక్టుపై వెనక్కి తగ్గేది లేదు

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా విలేజ్ ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం వెనక్కి తగ్గేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి బుధవారం ప్రకటించారు. సోమవారం లగచర్ల గ్రామంలో ప్రతిపాదిత ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ గ్రామస్తులు, రైతులు వికారాబాద్ జిల్లా కలెక్టర్, అధికారులపై దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి ఈ ప్రాజెక్టుపై స్పందించారు. ఆయన కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రతిపాదిత ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. ఇక్కడకు పరిశ్రమ తప్పకుండా వస్తుందని, ఫార్మా మాత్రమే కాకుండా ఇతర కంపెనీలు కూడా వస్తాయన్నారు. ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. కలెక్టర్, ఇతర అధికారులపై దాడిని తిరుపతి రెడ్డి ఖండించారు. దాడికి పాల్పడిన వారందరూ అరెస్ట్ అవుతారన్నారు. ఫార్మా ప్రాజెక్టుపై శాంతియుతంగా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంటే అమాయకులను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం భూములను బలవంతంగా లాక్కుంటోందన్న హరీశ్ రావు వ్యాఖ్యలపై తిరుపతి రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో మల్లన్న సాగర్ ప్రాజెక్టు కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినట్లుగా తాము రాత్రికి రాత్రే గ్రామాలను ఖాళీ చేయించడం లేదని చురక అంటించారు. రైతులపై దాడులు కూడా చేయడం లేదన్నారు.

## హరీశ్.. తెలుసుకొని మాట్లాడు

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**



హరీష్ రావు తెలుసుకొని మాట్లాడాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన జగిత్యాల అభివృద్ధి ఉమ్మడి రాష్ట్రానికి రోల్ మోడల్ గా నిలిచిందని క్లారిటీ ఇచ్చారు. ప్రజాసంక్షేమం కోసం కట్టుబడి ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్ ల ప్రెస్ మీట్ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకుల పై మండిపడ్డారు. ధాన్యం సేకరణలో గత ఖరీఫ్ కంటే ముందంజలో ఉన్నామన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుకు వడ్డీ కట్టడానికి మళ్ళీ అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం మూసి ప్రక్షాళన అవశ్యకత ను గుర్తించి మూసి ప్రక్షాళన మొదలు పెట్టారని తెలిపారు. మూసి ప్రక్షాళన లో నిర్వసితుల కు న్యాయం చేసిన తర్వాతే మూసి ప్రక్షాళన మొదలు పెడుతామన్నారు. ప్రజాసంక్షేమం కోసం కట్టుబడి ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు చేసిన రుణమాఫీ కేవలం వడ్డీ మాఫీగానే మిగిలిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏక కాలంలో రూ.18000 కోట్లతో రైతుల కు రెండు లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నామన్నారు. రుణమాఫీ కాని రైతులకు ఈనెల చివరిలో పూర్తిగా రుణమాఫీ చేస్తామని క్లారిటీ ఇచ్చారు. హరీష్ రావు పై విప్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. సాంకేతిక కారణలతో రైతు రుణమాఫీలో కొంత జాప్యం జరిగిందన్నారు. రుణమాఫీ కాని రైతుల సమస్య గురించి సీఎం దృష్టికి తీసుకెళ్ళామన్నారు. హరీష్ రావు ఎక్కడికి రమ్మంటావు.. 65 వేల కుటుంబలకు రుణమాఫీ చేసామన్నారు. జిల్లా అభివృద్ధి, రైతు రుణమాఫీలో తెల్చుకుందామా ఎక్కడికి రమ్మంటావో చెప్పు హరీష్ రావు అని సవాల్ విసిరారు. రైతులు ఆత్మహత్య చేసుకుంటే ఒక్క రైతునైన పరామర్శించారా? అని ప్రశ్నించారు. డబ్బుల సంచుల సంస్కృతి మాది కాదు.. మీ మామ కేసీఆర్ ది హరీష్ రావు అన్నారు. హరీష్ రావుకు 70 ఎంఎం చూపిస్తా అన్నారు. ధర్మపురిలో పూజలు, యాగాలు చేసిన కేసీఆర్.. 500 కోట్లు కేటాయిస్తాను అని అన్నావు ధర్మపురి అభివృద్ధికి ఏం అయ్యిందని ప్రశ్నించారు.

## ప్రశ్నించే గొంతును నిర్బంధాలతో అణిచివేయలేరు..

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**




ప్రశ్నించే గొంతును నిర్బంధాలతో అణిచివేయలేరని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలన గాలికి వదిలి అరెస్టులు, అక్రమ కేసులు, ముందస్తు నిర్బంధాలు విధిస్తూ రాజకీయ కక్ష తీర్చుకోవడం సిగ్గుచేటన్నారు. పచ్చని పొలాల్లో ఫార్మసిటీ పేరిట చిచ్చు పెట్టడమే మీ ప్రజాపాలనా? అని ప్రశ్నించారు. నడి రాత్రి రైతులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో పెట్టడమే మీ ఇందిరమ్మ రాజ్యమా? అని మండిపడ్డారు. ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు, కేసులు, నిర్బంధాలతో అణిచివేయలేరని హెచ్చరించారు. మీ బెదిరింపులకు బీఆర్ఎస్ పార్టీ భయపడదన్నారు. ప్రజాక్షేత్రంలోనే మిమ్మల్ని ఎండగడతం. ప్రజల తరఫున నిలదీస్తూనే ఉంటామన్నారు. అరెస్టు చేసిన పట్నం నరేందర్ రెడ్డిని, రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు అన్నారు. మరోవైపు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. పట్నం నరేందర్ రెడ్డి నివాసం వద్దకు వెళ్లారు. పట్నం నరేందర్ రెడ్డి సతీమణితో మాట్లాడారు. అక్కడ సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. కలెక్టర్ పై దాడి జరగడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటన బీఆర్ఎస్ నేతలపై కావాలని కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం లో జరిగిన ఘటన.. అధికారుల మీద కోపంతో కాదు ముఖ్యమంత్రి మీద కోపం ఈ ప్రభుత్వం మీద కోపంతో దాడి జరిగిందన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం రైతుల బాధ వినండి అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ల్యాండ్ కి సంబంధించి 8 నెలలు రైతులను ఒప్పించి వాళ్ళకి ఏం కావాలో తెలుసుకున్నామన్నారు. ఇది న్యాయం కాదు, రెచ్చగొట్టే విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమంగా అరెస్టు చేయడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల ఈ ఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు.

## బతుకమ్మ కుంటలో కూల్చివేతలు ఉండవు

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. దాని పునరుద్ధరణపై స్థానికులతో మాట్లాడారు. నిర్మాణ వ్యర్థాలు పోసి ఆక్రమించడంతో 16 ఎకరాలు ఉన్న బతుకమ్మ కుంట 5.15 ఎకరాలకు కుచించుకుపోయిందని, స్థానికుల విజ్ఞప్తితో చెరువు పునరుద్ధరణ పనులు చేపడతామని ఆయన హామీనిచ్చారు. నివాసాలు, నిర్మాణాల జోలికి హైడ్రా వెళ్లదంటూ స్థానికులకు రంగనాథ్ భరోసానిచ్చారు. హైడ్రా కమిషనర్ రాకతో బతుకమ్మ కుంట పరిసరాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు భద్రత మధ్య రంగనాథ్ బతుకమ్మ కుంటను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''బతుకమ్మ కుంటలో కూల్చివేతలు ఉండవు. కుంటను పునరుద్ధరిస్తాం. కూల్చివేతల చేపడతామనే అపోహ స్థానికుల్లో ఉంది. దాన్ని తొలగించేందుకే బతుకమ్మకుంటకు వచ్చాను. ప్రస్తుతమున్న ఐదు ఎకరాల విస్తీర్ణంలోనే పునరుద్ధరణ చేస్తాం. చెరువులోకి వరద నీరు వచ్చే మార్గాలపై అధికారులతో చర్చిస్తాం. హైడ్రాకు నోటీసులు ఇచ్చే అధికారం ఉంది. ఆక్రమణదారులకు హైడ్రా నోటీసులు వెళ్తూనే ఉంటాయి''అని రంగనాథ్ తెలిపారు.





## ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలి

- కొనుగోలు ప్రక్రియలో సమస్యలు లేకుండా చూడాలి
- రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు
- ఆర్డీవో రమాదేవి

**మెదక్, నవంబర్ 13 (ప్రజా స్వరం) :** రైతు నుండి ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు. మంగళ వారం మెదక్ మండలం మాచవరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందిస్తున్న సదుపాయాలు, ధాన్యం విక్రయ కేంద్రాల్లో రైతుల సమస్యలు తెలుసుకొని, వాటికి తగిన పరిష్కారాలు చూపేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ధాన్యం విక్రయాల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు సకాలంలో చెల్లింపులు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన దాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు విక్రయాలు చేయొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతమైన వాతావరణంలో సర్వే

- జిల్లాలో ఇప్పటి వరకు 33శాతం సర్వే ప్రక్రియ పూర్తి
- ప్రజలు నిరభ్యంతరంగా వివరాలను ఇవ్వాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, నవంబర్ 13 (ప్రజా స్వరం) :**

జిల్లాలో ప్రజల సహకారంతో ప్రశాంత వాతావరణంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం రామాయంపేట పట్టణంలో కుటుంబ సర్వేను మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్క నిరుపేద కి అందించాలనే లక్ష్యంతోనే సమగ్ర సర్వే కి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 02 లక్షల 20 వేల కుటుంబాలకు గాను 1600 మంది ఎన్యూమరేటర్స్, 170 మంది సూపర్వైజర్, నియమించుకొని సర్వే ప్రక్రియను జిల్లాల సమర్థవంతంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 33 % సర్వే ప్రక్రియ పూర్తి చేశామని, పూర్తి స్థాయిలో పది రోజులలో చివరి దశ కు చేరుకుంటుందని అన్నారు. ప్రజలందరూ ఎటువంటి సందేహాలకు గురి కాకుండా, నిరభ్యంతరంగా కుటుంబ సర్వే వివరాలు అందించి ఎన్యుమరేటర్ల కు సహకరించాలన్నారు. సర్వే ఫారంలో ప్రధాన ప్రశ్నలలో ఎలాంటి సమస్య ఎదురైన వెను వెంటనే ఎన్యూమరేటర్స్, సూపర్వైజర్లు మరింత సమాచారం తెలుకోవడం కోసం ప్రణాళిక శాఖ నుండి అందించినటువంటి ఎన్యూమరేటర్స్ మార్గదర్శకాల పుస్తకంలో చూసుకోని ఎప్పటికప్పుడు సవరించుకోవాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో సర్వే ప్రక్రియను పరిశీలించడానికి మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్ మండల అభివృద్ధి అధికారులు పనిచేస్తున్నారని అన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగం పుంజుకుందని 40 సెంటర్లకు గాను ట్యాగింగ్ చేయడం జరిగిందని, డిఫాల్ట్ మిల్లర్స్ 25 శాతం పెనాల్టీ కట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. మిల్లర్స్ కూడా ముందుకు వచ్చినట్లు చెప్పారు. త్వరలో ఇంకా 40 మిల్స్ అందుబాటులోకి వస్తాయని, కొనుగోలు వేగం పుంజుకుంటుందని అన్నారు. అదే విధంగా జిల్లాలో ధాన్యం భద్రపరచడానికి కొన్ని గోడౌన్స్ కూడా అందుబాటులోకి ఉంచామన్నారు. వాతావరణ అసమతుల్యతను దృష్టిలో పెట్టుకుని కొనుగోలు సెంటర్లో అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా టార్పలిన్స్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. జిల్లాలో ఈ సారి ధాన్యం ఎక్కువ మొత్తంలో ఉన్నట్లు ఇతర జిల్లాలకు తరలించేందుకు కమిషనర్ సివిల్ సప్లై వారికి అలాట్మెంట్ ఇవ్వాలని ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ వివరించారు. ధాన్యం కొనుగోలు సమస్యలు ఉన్నట్లయితే వెంటనే సమస్యల నివృత్తికి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 9281103685 నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు సమస్యలు నివృత్తి చేసుకోవచ్చని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ కమిషనర్ దేవేందర్, తహసిల్దార్ రజని, సంబంధిత ఎన్నిమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



## కులగణన సర్వేపై డీబీఎఫ్ ప్రచారం



**దౌల్తాబాద్, నవంబర్ 13 (ప్రజా స్వరం) :** రాష్ట్ర ప్రభుత్వం చెపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ విద్య, ఉపాధి సమగ్ర కుటుంబ కుల గణన సర్వే లో తమ వివరాలను నమోదు చెసుకొవాలని దళిత బహుజన ఫ్రంట్ ( డిబిఎఫ్) బుధవారం రాయపోల్ మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించింది. రాయపోల్ లో దళిత వాడలో జరిగిన సర్వే లో డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పర్యవేక్షించారు. కుటుంబాల వివరాల నమోదు పరిశీలించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శంకర్ మాట్లాడుతూ కుల గణన సర్వే తమ సామాజిక,ఆర్థిక, రాజకీయ, భూమి,ఉపాధి,విద్య రిజర్వేషన్ ల వల్ల లబ్దిపొందున వివరాలు రాయించుకొవాలన్నారు. భూమి లేకపొవడం,భూమి వుండి పట్టాలు లేకపొవడం ,అసైన్డ్ భూముల అన్యాక్రాంతం వివరాలని విధిగా నమోదు చెయించుకొవాలన్నారు. 56 వ చివరి ప్రశ్నలో దళిత కుటుంబాలు ఎదుర్కున్న కుల వివక్ష,దేవాలయాల ప్రవేశాల నిరాకరణ నమోదు చెయించాలన్నారు. గ్రామాల నుండి అంతరాష్ట్ర పరిధిలో వలసలు వెళ్ళె వారి వివరాల కాలమ్ చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, సీనియర్ జర్నలిస్టు పుట్ట రాజు, కనుక స్వామి నవీన్, ముకుందం, విష్ణు, లింగం, శంకర్, అజయ్, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

**ఎంపీని కలిసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు**

**మెదక్, నవంబర్ 13 (ప్రజా స్వరం) :** పదో తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలని ఎంపీ రఘునందన్ రావు ను ఉపాధ్యాయ సంఘాలు కలిశారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రం లో పదవ తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ను కలిసి ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. అందుకు ఎంపీ సానుకూలంగా స్పందించి ఖచ్చితంగా ఏర్పాటు చేయిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. మెదక్ లో పదవ తరగతి మూల్యాంకన కేంద్రం లేకపోవడం వలన సంగారెడ్డి జిల్లా లోని బీహెచ్ఈఎల్ కు ఉపాధ్యాయులు మూల్యాంకణానికి వెళ్లడం చాలా వ్యయ ప్రయాసలకు గురవుతున్నారని వివరించడం జరిగిందని ఎంపీ కి వారు వివరించారు. ఈ కార్యక్రమం లో ఏస్టియూ టీఎస్ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్, టీపియూఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం లక్ష్మణ్ లు పాల్గొన్నారు.



## తప్పులు లేకుండా సర్వే చేపట్టాలి

**ఎంపీడీవో యాదగిరి**



**జగదేవ్‌పూర్, నవంబర్12 (ప్రజాస్వరం ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో భాగంగా బుధవారం మండల కేంద్రం తో పాటు మునిగడప, తీగుల్ గ్రామాల్లో చేపట్టిన సర్వే ను జగదేవపూర్ ఎంపీడీఓ బి.యాదగిరి ,మండల పంచాయితీ అధికారి ఎండి.ఖాజా మోహినోద్దీన్ తో కలసి పరిశీలించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ఫారం లో ఇచ్చిన అన్ని కాలాలను తప్పులు లేకుండా నింపాలని , ప్రభుత్వము సూచించిన నిబంధనల ప్రకారం గ్రామాల్లో సర్వే నిర్వహించాలని,ప్రతి కుటుంబం యొక్క సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులానికి సంబంధించిన, భూములు, రిజర్వేషన్లు, రాజకీయ నేపథ్య వివరాలు అడిగి తెలుసుకుని మాత్రమే నమోదు చేయాలి గాని , ఎనుమారెటర్ వ్యక్తి గత జోక్యం చేసుకోరాదు అన్నారు. తదనంతరం తీగుల్ గ్రామం లో నిర్వహించిన 202425 ఉపాధి హామి పనుల గుర్తింపు గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామి పథకం లో భాగంగా చేపట్టే తోటల పెంపకం, ఫాం ఫండ్ ల ఏర్పాటు రైతుల పంట పొలాలకు వెళ్ళే మట్టి రోడ్లను అభివృద్ధి చేసుకోవడం లాంటి పనులను గుర్తించి రైతుల నుండి దరఖాస్తులు తీసుకోవాలని అన్నారు. గ్రామం లోని రైతులు ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామం లో అంగన్ వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార దినోత్సవం లో పాల్గొని పిల్లలకు సరైన పౌష్టికారాన్ని అందించాలని, సరైన సమయంలో టీకాలు వేయించాలి అన్నారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శులు రామ్ రెడ్డి, హరీష్ కుమార్, నరేందర్, ఉపాధి హామి సిబ్బంది, ఆంగన్ వాడీ టీచర్, ఎనుమారెటర్స్, తదితరులు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

- 10.300 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత
- ఇద్దరు నిందితుల అరెస్ట్, రిమాండ్ 4

**తూప్రాన్, నవంబర్13 (ప్రజాస్వరం) :**

అంతరాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకొని బుధవారం వినాయకుని తరలించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు ఆయన బుధవారం తూప్రాన్ డిఎస్పీ ఆఫీసులో డిఎస్పి వెంకట్ రెడ్డితో నిందితుల వివరాలను వెల్లడించారు ఈ సందర్భంగా ఆయన తెలిపి వివరాలుమనోహరబాద్ మండలం జీడిపల్లి గ్రామ శివారులోని నేషనల్ హైవే 44 రోడ్డు అండర్ బ్రిడ్జి వద్ద గంజాయి అమ్ముతున్న సమాచారం మేరకు మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్ సిబ్బందితో కలిసి దాడులు చేయగా బీహార్ రాష్ట్రానికి చెందిన రంజన్ కుమార్ అనే వ్యక్తి వద్ద కిలో గంజాయి పట్టుబడిందన్నారు. రంజన్ కుమారుని పట్టుకొని విచారణ చేయగా అతనితో కలిసి ఒడిస్సా రాష్ట్రానికి చెందిన శ్రీధర్ సాహు అనే వ్యక్తి ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో తన స్నేహితుని దగ్గర ఉంటూ గంజాయి విక్రయిస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నాడు. రంజన్ కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు మనోరబాద్ ఎస్సై సుభాష్ గౌడ్ ముప్పిరెడ్డిపల్లి లోని శ్రీధర్ సాహూ స్నేహితుడు ఇంటికి వెళ్లి వెతకగా ఇంట్లో మంచం కింద 9 కిలోల 300 గ్రాముల గంజాయి ఉందని రంజన్ కుమార్ శ్రీధర్ సాహులను పట్టుకొని విచారణ చేసి ఇద్దరి దగ్గర ఉన్న మొత్తం పది కిలోల 300 గ్రాముల గంజాయిని పట్టుకొని వారి వద్ద ఉన్న రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు వీరిద్దరిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్కు తరలించామని ఎస్పీ ఉదయ్ కుమార్ ఈ కేసు చేదించిన తూప్రాన్ సిఐ రంగాకృష్ణ మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ సిబ్బంది ప్రసాద్ అనిల్ శ్రీనివాస్ గౌడ్ బిక్షపతి లను ఎస్పీ అభినందించారు.

## నేటి నుండి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

**మెదక్, నవంబర్ 13 (ప్రజా స్వరం) :** నేటి నుండి ఈ నెల 20 తేదీ వరకు మెదక్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 తేదీన ఉదయం 11 గంటలకు బాలల దినోత్సవం దేశ భక్తి గేయాలు పోటీ, మ్యూజికల్ చైర్ పోటీ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 15 తేదీ పాటల పోటీ నిర్వహణ ఉంటుందని,16 తేదీన పుస్తక ప్రదర్శన, వ్యాసా రచన పోటీ, క్రీడల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ, ఇంటర్నెట్ ఉపయోగం సంబంధిత కార్యక్రమాలు, 17 తేదీ ఆదివారం చదరంగం పోటీ, 18 తేదీన వక్తృత్వ పోటీ, నేటి సమాజంలో గ్రంథాలయాలు పాత్ర, మాదక ద్రవ్యాల నిర్మూలన చర్యలు, 19 తేదీన మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళలు బాలికలకు రంగోలి పోటీలు 20 తేదీ ముగింపు సమావేశం లో బహుమతుల ఆందజేత ఉంటాయన్నారు. వ్యాస రచన చిత్రలేఖనం పోటీలకు ప్రతి పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు మాత్రమే పాల్గొనవలసి ఉంటుందని రంగోలి పోటీలకు పది మందికి మించకుండా ప్రతి పాఠశాల నుండి ఒక గ్రూపు మాత్రమే పాల్గొనాలని అన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల పేర్లను ఈనెల 14 తేదీ లోగా వంశీ కృష్ణ కార్యదర్శి, గ్రంథాలయ అధికారికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



## ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలి

**మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్**

**శామీర్‌పేట, నవంబర్ 13 (ప్రజా స్వరం) :** మండలం కేశవరం గ్రామంలో పవిత్ర గ్రంధం భగవద్గీత ఇంటింటికి పంపిణీ చేశారు. బుధవారం మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్ హాజరై మాట్లాడుతూ క్రిస్టియన్ సోదరుల కు బైబిల్ ఎలాంటిదో ముస్లిం సోదరులకు ఖురాన్ ఎలాంటిదో హిందూ సోదరులకు భగవద్గీత అలాంటి దని అని అన్నారు. భగవద్గీత చదవడం చాలా ముఖ్యమని, నరుడి అభ్యున్నతికి నారాయణుడు బోధించిన జీవనసారం గీత. ఇక్కడ నారాయణుడు శ్రీకృష్ణ భగవానుడు. నరుడు.. ఆ రోజు ఒక్క అర్జునుడే! ఈ రోజు.. మనమంతా! మాయామోహితుడైన అర్జునుడిని ఉద్ధరించడానికి ఉపదేశించింది మాత్రమే కాదు, ప్రతి మనిషినీ మహోన్నతుడిగా తీర్చిదిద్దడానికి శ్రీకృష్ణుడు పూరించిన శంఖారావం ఇది. అర్జునుడిని శిష్యుడిగా ఎంచుకొని తాను ఆచార్యుడిగా ప్రామాణిక మానసిక వికాస సూత్రాలను అందించాడదన్నారు. అందరూ భగవత్గీత చదవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కేశవరం మాజీ ఎంపీటీసీ గోనే హనుమంత్ రెడ్డి, ఏలూరి కొమరయ్య, బొమ్మలపల్లి మల్లేష్, ఉడతల కృష్ణ, మేడోజీ బలరాంచారి, శ్రీనివాస్ రెడ్డి, బొమ్మలపల్లి శ్రీశైలం, సుధాకర్, రామస్వామి, భూమేష్, లక్ష్మీనారాయణ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

**నార్సింగి, నవంబర్ 13 (ప్రజా స్వరం**

నార్సింగి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ సందర్శించారు.ఆస్పత్రి రికార్డులను, ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే అవుట్ పేషెంట్ రికార్డులను, ల్యాబ్ రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగేలా సిబ్బంది చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసుకునేలా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గర్భిణీలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాధలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రేమతో ఉత్తమంగా సేవలు అందించాలన్నారు. అదనపు వైద్య ఆరోగ్య అధికారి జ్ఞానేశ్వర్ తూప్రాన్ డివిజన్, అదనపు వైద్య ఆరోగ్య అధికారి నర్సాపూర్ సృజన, మెదక్ అదనపు వైద్య ఆరోగ్య అధికారి నవీన్, మండల వైద్య ఆరోగ్య అధికారి రేఖ, రావి కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

**నార్సింగి, నవంబర్ 13 (ప్రజా స్వరం)** నార్సింగి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ సందర్శించారు.ఆస్పత్రి రికార్డులను, ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే అవుట్ పేషెంట్ రికార్డులను, ల్యాబ్ రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగేలా సిబ్బంది చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసుకునేలా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గర్భిణీలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాధలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రేమతో ఉత్తమంగా సేవలు అందించాలన్నారు. అదనపు వైద్య ఆరోగ్య అధికారి జ్ఞానేశ్వర్ తూప్రాన్ డివిజన్, అదనపు వైద్య ఆరోగ్య అధికారి నర్సాపూర్ సృజన, మెదక్ అదనపు వైద్య ఆరోగ్య అధికారి నవీన్, మండల వైద్య ఆరోగ్య అధికారి రేఖ, రావి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


## సైబర్ నేరాలపై అవగాహన




**నార్సింగి, నవంబర్ 13 (ప్రజా స్వరం) :** నార్సింగి మండల కేంద్రంలో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మహిళల పై దాడులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాలల పై దాడులు, వరకట్న వేధింపులు, ట్రాఫిక్ నిబంధనలు, తదితర విషయాల పై చైతన్యం కల్పించారు. త్రిబుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనం నడపడం, రాంగ్ రూట్లో నడపడం వల్ల ప్రమాదానికి గురైతే ప్రమాద భీమా చేసుకుని ఉన్నా భీమా డబ్బులు రావని తెలిపారు. చట్టాలు ప్రజల రక్షణ, మేలు కొరకు చేశారని అధిగమిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. అందరూ మత్తు పదార్థాల వాడకం నుంచి దూరంగా ఉండాలని, అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోకూడదని అన్నారు. భారత్ న్యాయ సంహిత నూతన చట్టాలు అమలు లోకి వచ్చాయని, నూతన చట్టాలు కఠినంగా ఉన్నాయని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన శిక్షలు పడతాయని, పాత చట్టాల ప్రకారం ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ఉండేదని, నూతన చట్టాలతో మార్పు వచ్చిందని, నేరస్తులకు లాఠీ పోలీసులని తెలిపారు. సైబర్ నేరాలకు మూలం అత్యాశ, అజ్ఞానమని, ఎవ్వరూ డబ్బులు ఊరకే ఇవ్వరని, ఆశ పడితే మోస పోతామని అన్నారు. ఫోన్ పై వచ్చిన ఎలాంటి లింకులను ఓపెన్ చేయకూడదని, బ్యాంకు, ప్రభుత్వ శాఖల వారు ఫోన్ కు ఎలాంటి లింకులు పంపరని గుర్తుంచు కోవాలని అన్నారు. ఒకే వేల సైబర్ మోసాలకు గురైతే 1930 పై తక్షణమే ఫిర్యాదు చేయాలని, లేదా సమీప పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని అన్నారు. పోలీసులు ఇరవై నాలుగు గంటలు ప్రజల రక్షణ కొరకు పాటు పడతారని, అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సూచన ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్, స్టేషన్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక





## సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కౌన్సిలర్

**కీసర, నవంబర్ 13 (ప్రజా స్వరం) :**

18వ వార్డు అభివృద్ధికి మరింత కృషి చేస్తానని కౌన్సిలర్ పంగ హరిబాబు అన్నారు. బుధవారం నాగారం మున్సిపల్ పరిధిలోని 18వ వార్డు, ఓల్డ్ విలేజ్ లో మున్సిపల్ నిధులు 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్ పంగ హరిబాబు పరిశీలించారు. ఈ ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టు సూచించారు. ఈ కార్యక్రమంలో నాగులు, కపిల్ తివారీ, అన్నంరాజు హరిబాబు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## సర్వేలో ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టొద్దు

**చిన్న శంకరంపేట, నవంబర్ 13 (ప్రజాస్వరం) :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమగ్ర కుటుంబ సర్వేలో ఉపాధ్యాయులకు స్వేచ్ఛ నివ్వాలని బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో దామోదర్ కు వినతి పత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఒక్కొక్కరికి 150 కుటుంబాల చొప్పున సర్వే చేయాలని పేర్కొన్నప్పటికీ, అధికారులు మాత్రం రోజుకు పది పదిహేను ఇండ్లు చేయాలని అధికారులు ఉపాధ్యాయులను ఇబ్బందులు పెట్టడం సరికాదని, స్వేచ్ఛ ఇచ్చి చేయించాలే తప్ప టార్గెట్లిచ్చి ఇబ్బందులు పెట్టరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ సంఘాలు బాధ్యులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**దౌల్తాబాద్, నవంబర్ 13 ప్రజాస్వరం :**

అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి మండల పరిధిలోని ఇందుప్రియాల్ గ్రామానికి చెందిన పోతరాజు రామస్వామి (40) అప్పుల బాధ భరించలేక మంగళవారం పురుగుల మందు తాగాడు విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# చట్టాలపై అవగాహన అవసరం

## రాయపోల్ ఎస్ఐ విక్కుర్తి రఘుపతి

**దౌల్తాబాద్, నవంబర్ 13 (ప్రజాస్వరం) :**

విద్యార్థులకు మహిళల రక్షణ చట్టలు, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి అవగాహన కల్పించడం జరిగిందని రాయపోల్ ఎస్ఐ రఘుపతి అన్నారు. బుధవారం రాయపోల్ మండలం రామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రఘుపతి మాట్లాడుతూ చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. కష్టపడి చదవాల్సిన వయస్సులో చెడు అలవాట్లకు బానిసలు కావద్దని సూచించారు. కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. భారతదేశంలో నూతన చట్టాలు జూలై 1 నుంచి అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నూతన చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నూతన చట్టాలలో నేరం చేసిన నేరస్తులకు కఠినమైన శిక్షలు అమలు చేయడం జరుగుతుందన్నారు. బాధితులకు అండగా చట్టాలు నిలుస్తాయని పేర్కొన్నారు. మహిళలు, పిల్లలు ఎవరితోటైనా హింసకు ఎవరైనా హేళనంగా మాట్లాడిన మౌనం వీడి తల్లిదండ్రులకు కానీ స్నేహితులకు కానీ చెప్పుకోవాలని సూచించారు. లేనిపక్షంలో డయల్ 100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. మహిళల, పిల్లల రక్షణకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. పిల్లలు, మహిళలు ఏమైనా సమస్యలు ఇంట్లో కానీ బయట కానీ ఎదుర్కొంటే వెంటనే షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667343 మహిళ పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435, సమాచారం అందించాలని, సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్ రెడ్డి, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళ కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం

## బీజేపీ అధికార ప్రతినిధి నందారెడ్డి

**చిన్నశంకరంపేట, నవంబర్ 13 (ప్రజాస్వరం) :**

భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు పోగుల రాజు ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నందా రెడ్డి హాజరై పార్టీ క్రియాశీల సభ్యత్వం కోసం కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థలలో బిజెపి పార్టీ అధిక సంఖ్యలో సర్పంచ్ స్థానాలు గెలుచుకోవాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి ఎక్కువ స్థానాలు కైవసం చేసుకునే విధంగా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు, గ్రామాల్లో కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామంలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టి తీసుకుపోయి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేయాలని, గ్రామ అభివృద్ధిలో ముందుండాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి నందా రెడ్డి సూచించారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు పట్లూరి పోగుల రాజు, ఎం ఎల్ ఎన్ రెడ్డి, సభ్యత్వ ఇంచార్జ్ రాగి రాములు, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మూర్తి శంకర్, మండల ప్రధాన కార్యదర్శి నైనా బోయిన దశరథం, నరేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మేడి స్వామి, యువ మోర్చా మండల అధ్యక్షుడు తాటికొండ రవి, పట్టణ అధ్యక్షులు ఆకుల రాజు, మహిళా మోర్చా అధ్యక్షులు మంజుల, ఓ బి సి మోర్చ మండల అధ్యక్షుడు శంకర్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కర్రల స్వామి, పెద్ద రమేష్, నర్ర ఎల్లం, నాగరాజు రాంప్రసాద్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ నిర్మాణాల కూల్చివేత

**కీసర, నవంబర్13 (ప్రజా స్వరం) :**

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాజ్ సుఖ్ నగర్‌లో కబ్జా చేసిన 40 ఫీట్ల రోడ్డు సుందరీకరణ - హైడ్రా చర్యలతో కాలనీ వాసులకు విముక్తి కలిగిందని నాయకులు, కాలనీవాసులు అన్నారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని నాగారం మున్సిపాలిటీ పరిధి రాజ్ సుఖ్ నగర్, బాలాజీ ఎన్‌క్లేవ్ వద్ద సర్వే నంబర్లు 146, 147లోని 40 ఫీట్ల రోడ్డు అక్రమంగా కబ్జా చేయడంతో కాలనీవాసులు నిత్యం రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ రోడ్డు గత పదేళ్లుగా కబ్జాలో ఉండిపోయిందని స్థానికులు వాపోయారు. అయితే కాలనీవాసులు హైడ్రాను ఆశ్రయించిన వెంటనే హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసి కాలనీ రహదారి క్లియర్ చేయడం ద్వారా సమస్యను పరిష్కరించారు. కాలనీవాసులు ఈ చర్యపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## రైతులు శాస్త్రీయ పద్ధతిని వినియోగించుకోవాలి

### మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్

**శామీర్‌పేట, నవంబర్ 13(ప్రజాస్వరం) :**

కేశవరం గ్రామంలో ఇక్రిశాట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతులకు అవగాహన నిర్వహిచారు. బుధవారం మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మల పల్లి నర్సింహులుయాదవ్ మాట్లాడుతూ సాంకేతికత శాస్త్రియ పద్దతిలో కనుగొన్న యంత్రాల ద్వారా భూసారా పరీక్షల ద్వారా వ్యవసాయ అధికారులు ఇచ్చే సలహాలు సూచనలు పాటించి రైతులు మంచి పంట దిగుబడిని సాధించి లాభాలను గడించాలని అన్నారు. అనంతరం కేశవరం, జగంగూడ, నాగిశెట్టిపల్లి గ్రామాలలో భూసారా పరీక్షలు నిర్వహించి రైతుల భూముల్లో ఏయే పంటలు పండించాలనేది పత్రాల రూపంలో అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇక్రీసాట్ అధికారులు, కేశవరం మాజీ ఎంపిటిసి గోనే హనుమంత్ రెడ్డి, రైతులు ఏలూరి కొమరయ్య, బొమ్మలపల్లి మల్లేష్, ఉడతల కృష్ణ, బలరాంచారి, శ్రీనివాస్ రెడ్డి, బొమ్మలపల్లి శ్రీశైలం, సుధాకర్, రామస్వామి, భూమేష్, లక్ష్మీనారాయణ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో నిందితులకు జైలు శిక్ష


## దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్

**దౌల్తాబాద్, నవంబర్ 13 (ప్రజా స్వరం) :**

దొంగతనం కేసులో నిందితులుగా ఉండి కొద్ది రోజలుగా తప్పించుకొని తిరుగుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా విచారణ చేపట్టి జైలు శిక్ష విధించగా వారిని రిమాండ్ కు తరలించడం జరిగిందని దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం తిరుమలపూర్ గ్రామంలో ఎనిమిది నెలల క్రితం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్నారు. విచారణ చేపట్టి సాంకేతిక పరిజ్ఞానంతో వారిని అరెస్టు చేసి గజ్వేల్ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి బి.ప్రియాంక హాజరుపరచగా కేసు వాదోపవాదములు పూర్తయిన తర్వాత విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు. నిందితులు సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం వాసర గ్రామం బీభ్యానాయక్, చందర్ నాయక్ తాండకు చెందిన రాథోడ (జాదవ్ నగేష్), జాదవ్ పుర్మాలిక్ ఇద్దరు తిరుమలాపూర్ గ్రామంలో తాళం వేసిన ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. బుధవారం అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా రాథోడ్ (జాదవ్ నగేష్) కు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, జాదవ్ పుర్మాలిక్ కు నాలుగు నెలల జైలు శిక్షతోపాటు పదివేల రూపాయల జరిమానా విధించడం జరిగిందని దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ తెలిపారు.







# పిచ్చి కుక్క వీరంగం

## పలువురికి తీవ్ర గాయాలు, ఆస్పత్రికి తరలింపు

**చేగుంట, నవంబర్ 13 (ప్రజా స్వరం) :**

పిచ్చి కుక్క దాడిలో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. గొల్లపల్లి గ్రామానికి చెందిన పలువురు తమ వడ్లను రోడ్డు పై ఆరబోయడానికి వెళుతుండగా ఆ ప్రాంతం నుంచి వస్తున్న పిచ్చికుక్క ఒక్కసారిగా మీద పడి గాయపరిచింది. గొల్లపల్లి గ్రామానికి చెందిన చెంది బాబు , చెంది స్రవంతి, గొట్టం కృష్ణవేణి, కాషాబోయిన నవనీత, గాయాలకు గురికాగా గొల్లపల్లి తాండ పాఠశాల నుండి ఇంటి వైపు వెళ్తున్న ప్రణవి అనే విద్యార్థినీ సైతం కుక్క కరిచి తీవ్రంగా గాయపరిచింది. కరీంనగర్ పాఠశాలలో చదువుతున్న గొల్లపల్లి తండాకు చెందిన రేఖ నందిని అనే విద్యార్థులను కూడా కుక్క కరవడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. గతంలో కూడా కుక్కల దాడిలో చాలామందికి గాయాలు కాగా స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. బుధవారం సాయంత్రం తీవ్రంగా గాయపడ్డ వారిని గజ్వేల్ ఆసుపత్రికి 108 అంబులెన్స్ ద్వారా హుటాహుటిన తరలించారు.

# ఘనంగా స్వయం పాలన దినోత్సవం



**దౌల్తాబాద్, నవంబర్ 13 (ప్రజా స్వరం):**

దౌల్తాబాద్ జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో బుదవారం పదో తరగతి విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి పలువురిని ఆకట్టుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడంతో పాటు డీఈవో గా పాఠశాలకు రావడం పలువురిని ఆకట్టుకుంది. డీఈవోగా అనూష పాఠశాలను సందర్శించి పరిశీలించడం, తనిఖీలు చేయడం ఆకట్టుకుంది. అలాగే పాఠశాల హెచ్‌ఎంగా అక్షితతో పాటు ఉపాధ్యాయులుగా ఇతర విద్యార్థులు వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెల్లూరి శేషయ్య విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటమ్మ, ఫ్రాన్సిస్ చౌరీ, కృష్ణవేణి, జయలక్ష్మి, మంజుల, భూపతి రెడ్డి, స్రవంతి, మహేశ్వరి, రాజేశం, మోహన్ లాల్ పాల్గొన్నారు.

# సమగ్ర సస్యరక్షణ చర్యలతో పంటల్లో అధిక దిగుబడి




**చిన్న శంకరంపేట, నవంబర్ 13 (ప్రజా స్వరం) :**

సెహగల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్డిఎఫ్సి బ్యాంక్ ఆర్థిక సహాయంతో మెదక్ జిల్లాలో ఎంపిక చేసుకున్న శంకరంపేట, చేగుంట, నార్సింగ్, మండలాలలోనీ 15 గ్రామాలకు చెందిన రైతులకు వ్యవసాయ విద్య పశు వైద్య సేవలతో పాటు ఆరోగ్య, నిటి యజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించడంతో ఆయా సంబంధిత రంగాలలో నిపుణుల చేత శిక్షణ కార్యక్రమం లో భాగంగా దాదాపు 30 మంది రైతులకు చేగుంట మండల కేంద్రంలోని రైతు వేదిక లో వరి పంట సాగుపై అవగాహనతో పాటు ఈ యాసంగిలో వేసుకోదగ్గ పంటలు విత్తన దశ నుండి పంట కోత వరకు వివిధ దశల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు చీడపీడల నివారణతో పాటు సమగ్ర సస్యరక్షణ చర్యలు, సమగ్ర పోషక యాజమాన్యం సమగ్ర తెగులు యాజమాన్యంతో పాటుగా వివిధ దశల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసార పరిరక్షణ, భూసార పరీక్ష ఆవశ్యకత గురుంచి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్ నారాయణ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అనుబంధ రంగాలపై సంపూర్ణ అవగాహన పెంచుకున్నప్పుడే రైతు పెట్టుబడి ఖర్చులు తగ్గుతూ అధిక దిగుబడి సాధిస్తూ అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని రైతులు వివిధ సమావేశాల్లో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో పాటిస్తూ పంటల సాగుపై పూర్తి అవగాహన పెంచుకున్నప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలుపడం జరిగింది ఈ కార్యక్రమంలో నగేష్ సమగ్ర పోషక యాజమాన్యం పై రైతులకు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు గౌతమ్ మణిదీప్, వ్యవసాయ విస్తరణ అధికారి మాధవి, రైతులు పాల్గొన్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 13 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm

## సీఎం అన్నను పంపిస్తారు..
# ఎంపీగా నేను వెళ్లకూడదా



**ఎంపీ డీకే అరుణను అడ్డుకున్న పోలీసులు**
**మన్నెగూడలో ఉద్రిక్తత**
**నా నియోజకవర్గంలో తిరగొద్దా? అని ప్రశ్నించిన ఎంపీ**

వికారాబాద్: మన్నెగూడ దగ్గర ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామంలోకి వెళ్లనివ్వకుండా ఎంపీ డీకే అరుణను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించిన నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల తీరుపై ఆగ్రహించారు. ఎంపీగా నా నియోజకవర్గంలో తిరగొద్దా అని ప్రశ్నించారు. నా నియోజకవర్గంలో ఎక్కడికైనా వెళ్లే హక్కు ఉందని చెప్పారు. నాకు కలెక్టర్ అపాయింట్‌మెంట్ ఉందని కూడా చెప్పారు. సీఎం వల్లే జిల్లాలో లా అండ్ ఆర్డర్ సమస్య వచ్చిందని విమర్శించారు. సీఎం అన్నను పంపిస్తారు..ఎంపీగా నేను వెళ్లకూడదా అని ఎంపీ డీకే అరుణ పోలీసులను నిలదీశారు.

## సీఎం అప్రజాస్వామిక చర్యలపై
# పోరాటం



**బీఆర్ఎస్ కు ఆపాదించే కుట్ర**
**ప్రభుత్వాన్నిప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు**
**భయపెట్టాలని చూస్తే**
**అది మూర్ఖపు చర్యే**
**లగచర్ల రైతులను విడుదల చేయాలి**
**బీఆర్ఎస్ గౌరవ అధ్యక్షుడు కేటీఆర్**

హైదరాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అరెస్టును బీఆర్ఎస్ గౌరవ అధ్యక్షుడు కేటీఆర్ ఖండించారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ప్రజలు చేసిన తిరుగుబాటును బీఆర్ఎస్ కు ఆపాదించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కార్యకర్తలతో మాట్లాడినా నేతలను అదుపులోకి తీసుకుంటున్నారన్నారు. ప్రజా తిరుగుబాటు అణచివేతకు అప్రజాస్వామిక చర్యలకు దిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు తప్పవని బెదిరిస్తున్నారని దుయ్యబట్టారు. తమను భయపెట్టాలని చూస్తే అది మూర్ఖపు చర్యే అవుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అప్రజాస్వామిక చర్యలపై పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఎంత అణచివేసే ప్రయత్నం చేస్తే అంతగా పోరాటం చేస్తామన్నారు. లగచర్లలో అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఏ1 సురేశ్

**46 మంది నిందితులు**
**16 మంది అరెస్టు**
**లగచర్ల దాడి ఘటన.. రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు**

వికారాబాద్: వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడి ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు 16 మందిని అరెస్టు చేశారు. మొత్తం 46 మందిని నిందితులుగా గుర్తించినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో తెలిపారు. ఏ1గా భోగమోని సురేశ్‌ను చేర్చారు. ఫార్మా పరిశ్రమ ఏర్పాటుకు అభిప్రాయ సేకరణ కోసం కలెక్టర్ సహా ఇతర అధికారులు వచ్చిన సమయంలో కొందరు కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారని చెప్పారు. అదనపు కలెక్టర్ లింగయ్య నాయక్, కడా అధికారి వెంకట్‌రెడ్డిపై హత్యాయత్నం చేశారని పేర్కొన్నారు.

**గ్రామంలోకి తీసుకెళ్లింది సురేశ్**

రాళ్ల దాడి కారణంగా కలెక్టర్, ఇతర అధికారులు, పోలీసులకు సైతం గాయాలయ్యాయని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. అభిప్రాయ సేకరణ కోసం ఉదయం 11 గంటలకు అదనపు కలెక్టర్ లింగయ్య, తాండూరు ఇన్‌ఛార్జి కలెక్టర్ ఉమాశంకర్, తహసీల్దార్లు కిషన్ నాయక్, విజయ్‌కుమార్, కడా ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి లగచర్లకు వచ్చారని పేర్కొన్నారు.



మొదట గ్రామ శివార్లలో గ్రామ సభ ఏర్పాటు చేశారని వివరించారు. అనంతరం సురేశ్ అనే వ్యక్తి కలెక్టర్ సహా ఇతర అధికారులను గ్రామంలోకి తీసుకువెళ్లాడని చెప్పారు. కలెక్టర్ వెళ్లిన సమయంలో అందరూ ఒకేసారి గుమిగూడారని.. ఆయన వాహనాన్ని అడ్డగించి నినాదాలు చేశారని తెలిపారు. కలెక్టర్ కారు దిగి వారి వద్దకు వెళ్లి మాట్లాడేందుకు ప్రయత్నం చేస్తుండగానే.. దాడి చేసి వాహనాలపై రాళ్లు విసిరి ధ్వంసం చేశారన్నారు. ఘటనపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనలో ఉపయోగించిన రాళ్లు, కర్రలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ నెల 11న లగచర్లలో జరిగిన ఘటనపై డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుగుతోందని పేర్కొన్నారు

## కిడ్నాపర్లలా వచ్చి తీసుకెళ్లి..
# అరెస్టు అంటారా?

**హైదరాబాద్**: వికారాబాద్ దాడి ఘటనలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు మఫ్టీలో వచ్చి తీసుకెళ్లారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కిడ్నాపర్లలా వచ్చి తీసుకెళ్తే దాన్ని అరెస్టు అంటారా..? అని ప్రశ్నించారు. నోటీసులు, కుటుంబానికి సమాచారం ఇవ్వకుండా తీసుకెళ్లారని విమర్శించారు. "నరేందర్‌రెడ్డికి ప్రైవేటు సిబ్బందితో వైద్య పరీక్షలు చేయించాలి. ప్రభుత్వ వైద్యులు, ప్రభుత్వ వ్యవస్థపై మాకు నమ్మకం లేదు. అరెస్టు చేసిన వారిని చిత్రహింసలు పెట్టారని సమాచారం. కలెక్టర్ దాడి జరగలేదన్నారు.. దాడి జరిగిందని ఐజీ చెబుతున్నారు. వికారాబాద్ లగచర్ల ఘటన నిఘా వ్యవస్థ వైఫల్యమే. ఉద్దేశపూర్వకంగా అశాంతి రగిల్చి భూములు లాక్కునే యత్నమిది" అని కేటీఆర్ ఆరోపించారు.



## బంగారు వర్ణంలో నాగు పాము

**విశాఖపట్నం** : విశాఖపట్నంలోని యారాడ నేవీ ఉద్యోగుల క్వార్టర్స్ లో అరుదైన నాగు పాము కనిపించింది. ఈ పాము పడగ మొత్తం బంగారు వర్ణంలో కనిపిస్తోంది. పడగకు ముందు వెనుక మాత్రమే బంగారు వర్ణంలో, మిగతా భాగం మొత్తం సాధారణంగా ఉండడం విశేషం. ఓ ఉద్యోగి కార్ షెడ్ లో కనిపించిందీ పాము. కారు బయటకు తీస్తున్న సమయంలో ఈ పామును చూసిన సదరు ఉద్యోగి స్నేక్ క్యాచర్ నాగరాజుకు ఫోన్ లో సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న నాగరాజు ఈ పామును బంధించారు.

# మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అరెస్టు

**దుద్యాల** : వికారాబాద్ జిల్లా కలెక్టర్ మీద జరిగిన దాడి ఘటనలో నరేందర్ రెడ్డి ప్రమేయం ఉందని పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. లగచర్లలో కలెక్టర్ మీద జరిగిన దాడిని బీఆర్ఎస్‌కు ఆపాదించే కుట్రలో భాగంగానే తనను అరెస్ట్ చేశారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు.తన అరెస్ట్‌పై ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి అప్రజాస్వామిక చర్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందన్నారు. సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రైతుల తిరుగుబాటుతో సీఎం కంగుతిన్నారన్నారు. ఆ డ్యామేజీని కంట్రోల్



చేసుకోవడానికే లగచర్లలో జరిగిన ఘటనను బీఆర్ఎస్‌కు ఆపాదించే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 42 సార్లు సురేశ్‌తో మాట్లాడారు

**ఫోన్ రికార్డు ఉంది**
**మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్య**

**నల్లగొండ**: లగచర్ల ఘటన సమయంలో నిందితుడు సురేశ్‌తో మాజీ ఎమ్మెల్యే ఒకరు 42 సార్లు మాట్లాడినట్లుగా తెలిసిందని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో మాట్లాడినట్లు కూడా ఫోన్ రికార్డింగ్ ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన వెనుక ఎంత పెద్దవాళ్లు ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. నల్గొండ జిల్లాలో పర్యటిస్తున్న మంత్రి మీడియాతో మాట్లాడుతూ... దాడులకు దిగిన వారికి మద్దతిస్తామని బీఆర్ఎస్ చెప్పడం



విడ్డూరంగా ఉందన్నారు.

# అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి...

**కాళోజీకి సీఎం రేవంత్ నివాళి**

హైదరాబాద్ : 'అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి... అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి... అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడ'ని ప్రకటించిన ప్రజా కవి కాళోజి నారాయణరావు గారు నిత్య స్మరణీయులని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కొనియాడారు. కాళోజి నారాయణరావు గారి వర్ధంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని అధికారిక నివాసంలో కాళోజి గారి చిత్రపటానికి ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించారు.



# ఇది రాజకీయ కక్షే



**పచ్చని పొలాల్లో చిచ్చు పెట్టడమే ప్రజాపాలనా?**
**మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్ : కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకోవడాన్ని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఖండించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. పాలన గాలికి వదిలి అక్రమ కేసులతో రాజకీయ కక్ష తీర్చుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. పచ్చని పొలాల్లో ఫార్మాసిటీ పేరిట చిచ్చు పెట్టడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు, కేసులతో అణచివేయలేరన్నారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని మాజీ మంత్రి పేర్కొన్నారు.

# ఆర్‌జీవీకి నోటీసులు

హైదరాబాద్ : టాలీవుడ్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మకు ఒంగోలు పోలీసులు హైదరాబాద్‌లోని వర్మ నివాసానికి చేరుకుని నోటీసులు అందజేశారు. ఈ నెల 19న మద్దిపాడు పీఎస్‌కు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వ్యూహం సినిమా సమయంలో టీడీపీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, నారా బ్రాహ్మణిలను కించపరిచేలా రామ్ గోపాల్ వర్మ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకుగాను మద్దిపాడు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రామలింగం పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు మద్దిపాడు పోలీసులు వర్మపై కేసు నమోదు చేశారు.



# నివాసాలు కూల్చబోం

**బతుకమ్మకుంటలో ఇకపై కూల్చివేతలు ఉండవు**
**హైడ్రా కమిషనర్ రంగనాథ్**
**అంబర్ పేటలో పర్యటన**

**హైదరాబాద్** : బతుకమ్మ కుంటలో ఇకపై కూల్చివేతలు చేపట్టబోమని హైడ్రా చీఫ్ రంగనాథ్ పేర్కొన్నారు. బుధవారం అంబర్ పేటలో ఆయన పర్యటించారు. బతుకమ్మ కుంటను సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. హైడ్రాపై అపోహలు, ఆందోళనలు అక్కర్లేదని హామీ ఇచ్చారు. ఆక్రమించిన స్థలంలో ఉన్న నివాసాలను కూల్చబోమని చెప్పారు. ఖాళీగా ఉన్న ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. స్థానికులతో బతుకమ్మ కుంట పునరుద్ధరణపై ఆయన చర్చించారు. 1962 నాటి రికార్డుల ప్రకారం బతుకమ్మ కుంట 16.13 ఎకరాల విస్తీర్ణంలో ఉండేదని, కాలక్రమంలో ఆక్రమణలకు గురై ప్రస్తుతం 5.15 ఎకరాలు మిగిలిందని చెప్పారు.

**ఆప్రచారం వట్టిదే..**

ఈ విషయంలో స్థానికులు విజ్ఞప్తి చేయడంతో బతుకమ్మ కుంట ఆక్రమణల తొలగింపు, పునరుద్ధరణ చర్యలు చేపట్టామని హైడ్రా చీఫ్ పేర్కొన్నారు. అయితే, ఆక్రమించిన స్థలంలో ఉన్నప్పటికీ నివాస సముదాయాల జోలికి వెళ్లబోమని స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మరోవైపు హైడ్రాపై జరుగుతున్న అసత్య ప్రచారంపైనా రంగనాథ్ స్పందించారు. హైడ్రా ఎఫెక్టుతో నగరంలో రిజిస్ట్రేషన్లు పడిపోయాయని జరుగుతున్న ప్రచారం అంతా వట్టిదేనని కొట్టిపారేశారు. రిజిస్ట్రేషన్లు పెరిగాయని చెప్పడానికి లెక్కలు కూడా ఉన్నాయని వివరించారు.



ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 13 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

# రైతులను ఉసిగొల్పింది బీఆర్ఎస్సే

**సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి ఆరోపణలు**



లగచర్ల : లగచర్ల గ్రామస్తులతో సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. భూములు ఇచ్చేందుకు గ్రామస్తుల అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులను ఉసిగొల్పి దాడులకు పాల్పడింది బీఆర్ఎస్ వారేనని విమర్శించారు. భూములిచ్చేందుకు రైతులు సుముఖంగానే ఉన్నారని తిరుపతిరెడ్డి అన్నారు.

# మరో నలుగురు అరెస్టు

**సురేశ్ సోదరుడితో సహ ముగ్గురు**
**వారిని వైద్యపరీక్షల నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు**



హైదరాబాద్ : వికారాబాద్ జిల్లాలోని లగచర్ల గ్రామంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు స్థల సేకరణ కోసం వెళ్లిన జిల్లా కలెక్టర్, తహశీల్దార్ పైన జరిగిన దాడి ఘటనపై పోలీసుల రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెలుగు చూశాయి. ఈ దాడి నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ తప్పించుకున్నారు. కలెక్టర్, అధికారుల కార్లను రైతులు ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు 46 మందిని నిందితులుగా రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. భోగమోని సురేష్ ఏ1గా, ఈ ఘటనలో మంగళవారం 16 మందిని అరెస్టు చేసినట్లు రిమాండ్ కు తరలించినట్లు వెల్లడించారు. గ్రామస్తులు దాడి చేయడంతో కలెక్టర్, అధికారులు, పోలీసులకు గాయాలు కావాడంతో దాడి, హత్యాయత్నంపై దర్యాప్తు కొనసాగుతోందని, ప్రధాన నిందితుడు సరేష్ సోదరుడితో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను నలుగురిని వైద్య పరీక్షల కోసం పరిగి సర్కార్ దవాఖానకు తరలించారు.

# కాకా కుటుంబానికి మంత్రి పదవి!


**సీఎం ఇస్తామని హామీ**
**ఎమ్మెల్యే వివేక్ కీలక వ్యాఖ్యలు**



హైదరాబాద్ : కాకా కుటుంబంలో ఒకరికి మంత్రి పదవి ఇస్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. నాకు మాలల అభివృద్ధి, హక్కులు ముఖ్యమంత్రి పదవి కాదని అన్నారు. హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న భారీ బహిరంగ సభకు మాలలు అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. మాలల ఐక్యతను చాటుకోవాలని వివేక్ తెలిపారు.

# భుజంగరావు బెయిల్ రద్దు


**రేపు సాయంత్రం 4 గంటలకు లొంగిపోవాలని నాంపల్లి కోర్టు ఆదేశం**
**గతంలో అనారోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్**



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావు బెయిల్ ను నాంపల్లి కోర్టు రద్దు చేసింది. అనారోగ్యంతో మధ్యంతర బెయిల్ పొందారు. రేపు సాయంత్రం 4 గంటల్లోపు జైలుకు తిరిగి వెళ్లాలని భుజంగరావుకు కోర్టు ఆదేశించింది. ఫోన్ ట్యాంపింగ్ కేసులో ఏ2గా ఆయన ఉన్నారు. ఈ ఏడాది ఆగస్టు 19 మధ్యంతర బెయిల్ ఇచ్చింది. తర్వాత పొడిగిస్తూ వచ్చింది. గత నెల రెగ్యులర్ బెయిల్ కోసం పిటిషన్ వేయగా కోర్టు తిరస్కరించింది. మార్చి 23న ఆయన అరెస్టయ్యారు. ఏ1గా ఉన్న ప్రభాకర్ రావు అమెరికాలో ఉన్నారు. ఆయన కోసం ఈ మధ్య రెడ్ కార్నర్ నోటీసులు సైతం జారీ చేశారు.

# త్వరలో తేల్చుతాం


**లగచర్ల ఘటనపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
**గులాబీ ముసుగు వేసుకొని దౌర్జన్యం**
**మంచి చేద్దామంటే బద్నాంకు యత్నం**



హైదరాబాద్ : వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై లగచర్లలో జరిగిన దాడి ఘటన వెనుక ఎవరు ఉన్నారో గుర్తించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఇలాంటి ఘటనల ద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ దాడి ఘటనకు సంబంధించి నిందితులను మీడియా ముందు ప్రవేశపెడతామన్నారు. రైతుల పేరుతో కొంతమంది గులాబీ ముసుగు వేసుకొని దౌర్జన్యానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఈ ఘటన వెనుక ఎవరు ఉన్నారో బయటకు రావాల్సి ఉందన్నారు. వికారాబాద్ ఘటన వెనుక ఉన్నది ఎవరో త్వరలో తేల్చుతామన్నారు. ప్రజలకు మంచి చేద్దామని తాము భావిస్తే బద్నాం చేయాలనుకోవడం దారుణమన్నారు.

# చంపి పొలంలో పూడ్చాడు

**ప్రియురాలిని హత్యచేసిన ప్రియుడు**
**కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు**
**పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వాస్తవాలు**
**భద్రాద్రి కొత్తగూడెంలో జిల్లా మాచినేనిపేట తండాలో రుణం**



భద్రాద్రి కొత్తగూడెం: యువతి దారుణ హత్యకు గురైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేనిపేట తండాలో దారుణం జరిగింది. స్వాతిని ఆమె ప్రియుడు వీరభద్రం అతి కిరాతకంగా చంపి గ్రామ సమీపంలోని పత్తి పొలంలో పాతిపెట్టాడు. మూడు రోజుల తర్వాత హత్య ఘటన వెలుగులోకి రావడంతో పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. మణుగూరు మండలం తోగ్గుడేనికి చెందిన స్వాతి(32) ఆరేళ్లుగా వీరభద్రంతో సహజీవనం చేస్తూ మాచినేనిపేట తండాలోనే ఉంటోంది. భద్రం భార్యతో పాటు స్వాతి కూడా ఒకే ఇంట్లో ఉంటున్నారు. కుటుంబ తగాదాలు, ఆర్థిక లావాదేవీలతో పాటు పలు కేసుల్లో భద్రం నిందితుడిగా ఉన్నాడు. కొంకాలంగా భద్రం, స్వాతిల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రియురాలి అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న భద్రం.. ఈనెల 9న తన ఇంట్లోనే స్వాతిని దారుణంగా హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని సమీపంలోని తన పత్తి పొలంలో పాతిపెట్టాడు. కొత్తగూడెం డీఎస్పీ, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణా ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు.. మృతదేహాన్ని వెలికి తీసే చర్యలు చేపట్టారు.